క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సూచనలిస్తున్న సూపర్‌వైజర్ సుజాత

సారవకోట: గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలని సారవకోట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సుజాత సూచించారు. మండలంలోని అన్నుపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఎక్కువగా ఆకు కూరలు, తాజా కూరగాయలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. అన్నుపురం, చిన్నగుజ్జువాడ, వాబ, పురుషోత్తుకర్ర అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా



సంఘటన స్థలంలో ఉన్న వ్యాన్

బూర్జ: మండలంలోని కొల్లివలస ప్రధాన రహదారిపై మంగళవారం వ్యాన్ బోల్తా పడింది. ఆమదాలవలస నుంచి పాలకొండ వైపు వెళ్తున్న టాటా ఏస్ వ్యాన్ అతి వేగంతో వెళ్తూ రోడ్డు పక్కనున్న కాల్వలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ప్రయాణికులు ఏవరూ లేరు. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బూర్జ: మండలంలోని పి.ఎల్.దేవిపేట పంచాయతీ నరేంద్రపురంలో అభయాంజనేయ స్వామి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త వండాన కామినాయుడు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం విశ్రాంత సైనికుడు వండాన కామినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఎల్.ఎన్.పేట: ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ కచ్చితంగా పాటించాలని తహసీల్దార్ ఎస్.రాణి అమ్మాజీ అన్నారు. మండలంలోని మొదుగువలస, గొట్టిపల్లి, కొమ్మువలస గ్రామాల్లో ఆమె పర్యటించారు. గోడలపైన రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించిన రాతలు, పోస్టర్లు, జెండాలు, బ్యానర్లు తొలగించాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



యలమంచిలి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగమ్మ

జలుమూరు: పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఇంటర్నెట్, దివ్యాంగులు ఓటు వేసేందుకు అవసరమైన ర్యాంప్‌లు, ఫర్నిచర్ తదితర వసతులు పక్కాగా ఉండాలని తహసీల్దార్ సి.హెచ్.నాగమ్మ అన్నారు. చల్లవానిపేట, కొమనాపల్లి, బొడ్డపాడు, యలమంచిలి పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పొగతో అవస్థలు!



మంటలు, పొగను అదుపు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: మేజరు పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగతో సమీప జగన్నాథపురం వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది మంగళవారం మంటలు, పొగను అదుపు చేశారు. పంచాయతీ ఈఓ చిన్నారావు ఆధ్వర్యంలో ట్యాంకుల్లో నీటిని తరలించి మంటలను, పొగను అదుపులోనికి తీసుకువచ్చారు. ప్రతిరోజూ ఈ విధంగా మంటలను అదుపు చేయాలని జగన్నాథపురం వాసులు కోరుతున్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



నరేంద్రపురంలో ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తోటవాడ పంచాయతీ కొమ్మువలస, పీఎల్‌దేవిపేట పంచాయతీ నరేంద్రపురం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేయడం జరిగిందన్నారు. ఈ ఐదేళ్లు మన కోసం బటన్ నొక్కిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఆయన విజయానికి తోడ్పాటు అందించాలన్నారు. కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం జగన్ అని, మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. ఈ ఐదేళ్లల్లో గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయన్నారు. సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే సీఎం జగన్ పాలన తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లోకి వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మాయమాటలు నమ్మవద్దన్నారు. గతంలో వారు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. తొలుత నరేంద్రపురం గ్రామంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తి నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్, మండల సచివాలయ కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, తోటవాడ సర్పంచ్ సూర ఆనందరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పాతపట్నం: వాకర్స్‌తో మాట్లాడుతున్న రెడ్డి శ్రావణ్, ఓంశ్రీకృష్ణ

ఎమ్మెల్యే రెడ్డి శాంతిని మళ్లీ గెలిపించాలి

పాతపట్నం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న రెడ్డి శాంతిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె తనయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి శ్రావణ్ కుమార్, రెడ్డి ఓంశ్రీకృష్ణ కోరారు. మంగళవారం ఉదయం పాతపట్నం మార్కెట్ కమిటీ యార్డ్ ఆవరణలో మార్నింగ్ వాకింగ్ చేస్తున్న వారితో కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. జిమ్ చేస్తున్న, క్రికెట్ ఆడుతున్న యువకులను కలిసి ఎమ్మెల్యేగా రెడ్డి శాంతిని గెలిపించాలని కోరారు. గ్రామ సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, ఎంఎస్ఎంఎస్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ, పనుకు మోహన్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం



పొందూరు: మాట్లాడుతున్న శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

- శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్
- ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించండి

పొందూరు: రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం వైపు పరుగులు పెట్టిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారని శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. స్థానిక జేవీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం ఎంపీగా పోటీచేస్తున్న తనను,ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాంను అత్యధిక మెజార్టీ గెలిపించాలని అభ్యర్థించారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు, తమ్మినేని పాపారావు ఆశయాలను పునికిపుచ్చుకుని వారి బాటలో నడుస్తున్న నాయకుడు తమ్మినేని సీతారాం అని అన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధిత కుటుంబాలకు, పరిసర ప్రజలకు మంచినీటిని అందించే దశాబ్దాల కలను సీఎం జగన్ నెరవేర్చారన్నారు. రూ.700 కోట్లతో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో 800 వందలకు పైగా గ్రామాలకు శుద్ధి చేసే తాగునీటిని అందించారన్నారు. రూ.70 కోట్లతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. నందిగాం మండలంలోని రూ.850 కోట్లతో ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను నిర్మించారన్నారు, వంశధార పరివాహక ప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు రూ.200 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్‌ను పెట్టేందుకు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. మూలపేటలో పోర్టు రూ.4,360 కోట్లతో నిర్మిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు నిరంతరం సెల్ఫీలు, ట్విట్టర్లు, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లోనే ఉంటున్నారని, ఎంజాయ్ చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. పీఎం నరేంద్ర మోదీని బీజేపీ, టీడీపీ, జనసేన అధినేతలు పొగడ్డమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు (లక్ష్మణరావు), ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, నాయకులు కొంచాడ రమణమూర్తి, కిల్లాన సూర్యారావు, బాడాన సునీల్‌కుమార్, కాకర్ల రాజారావు, బందారు జైప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



సిద్ధం కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకి మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మేం సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

తొలినుంచి వైఎస్సార్‌సీపీకి పట్టు ఉన్న పోలాకి మండలంలో కుట్రలు చేసి లబ్ధి పొందాలన్న టీడీపీ నాయకుల ఎత్తుగడలను చిత్తుచేయాలని పిలుపునిచ్చారు. కేడర్ సమన్వయంతో పని చేయాలని, ఎన్నికల వరకు ఏ చిన్న రాజకీయ మార్పును కూడా తేలిగ్గా తీసుకోవద్దని సూచించారు. అధిక సంఖ్యలో నాయకత్వ లక్షణాలు కలిగిన కేడర్ మన సొంతమన్నారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిపొందిన వారందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని, మనం కూడా సిద్ధంగా ఉన్నామన్న సంకేతాన్ని పంపించటం కోసమే మేం సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని అన్ని పంచాయతీల్లోనూ స్థానిక నాయకత్వం పట్టిష్టంగా నిర్వహించాలన్నారు. సిద్ధం కిట్లును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు రెంటికోట త్రినాథరావు, ఈసర్ల చిన్ని, తూలుగు అశోక్‌కుమార్, మజ్జి లక్ష్మీనారాయణ, నేతేటి వల్లన్నాయుడు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

22న నీలమణిదుర్గ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

పాతపట్నం: ఈ నెల 22వ తేదీన ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ ఆలయంలో హుండీ కానుకలను లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు, ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటల నుంచి లెక్కింపు ఉంటుందని, గ్రామ పెద్దలు, భక్తులు హాజరుకావాలని ఈఓ కోరారు.

పది పరీక్షలకు ముగ్గురు గైర్హాజరు

బూర్జ: మండలంలో పదో తరగతి హిందీ పరీక్షకు 491 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ 488 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓలు ఎన్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు మంగళవారం తెలిపారు. బూర్జ జెడ్పీహెచ్ఎస్‌లో 122 మందికి 122 మంది, కొల్లివలస డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో 136 మంది విద్యార్థులకు 136 మంది, ఓ.వి.పేట గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో 233 మందికి 230 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

695 మందికి వైద్య పరీక్షలు



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

బూర్జ: మండలంలోని ఏ.పీ పేట గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం గుత్తావల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వ హించారు. వైద్యాధికారి పి.రోజా ఆధ్వర్యంలో 695 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలువురిని కార్పొరేట్ హాస్పిటల్లకు రిఫర్ చేశారు. స్పెషలిస్టు వైద్యులు, గుత్తావల్లి పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమ్య, హెల్త్ సూపర్ వైజర్ కె.పద్మ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతపట్నంలో ఫ్లాగ్ మార్చ్



శివశంకర్ కాలనీలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పాతపట్నం: మండల కేంద్రంలో సీఐ నల్లి సాయి నేతృత్వంలో కేంద్ర బలగాలు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. 40 మంది జవాన్‌లు పాతపట్నం ప్రధాన రహదారి మీదుగా శివశంకర్ కాలనీలోని ఐదు వీధులు, దువ్వారి వీధిలో కవాతు చేపట్టారు. ఎన్నికల్లో శాంతిభద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా ఉండేందుకు ముందస్తుగా ప్రజలకు అప్రమత్తం చేస్తున్నామని సీఐ తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, తగాదాలు, కొట్లాటకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీల నేతలతోపాటు ప్రజలు కూడా నిబంధనలు అతిక్రమించకుండా ఉండాలని సూచించారు. కవాతులో ఎస్ఐ మహమ్మద్ యాసిన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు

జలుమూరు: మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, నరసన్నపేట ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్ విజయం సాధిస్తారని, దీనికి అన్ని వర్గాల ప్రజలు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని ఎంపీపీ వాన గోపి అన్నారు. కరవంజలో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, పైడి విఠల్‌రావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, జుత్తు నేతాజీ, ఎస్వీ రమణ, ధర్మాన బువాజీ, బుద్దల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మేం సిద్ధం అంటున్న ఎంపీపీ గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రమదానం



నరసన్నపేట: జమ్ము స్కూల్ వద్ద శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కొత్తూరు: మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురండిలో మంగళవారం ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల, దేవాలయం ఆవరణల్లో చెత్త, పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రామ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు వివరించారు.



కొత్తూరు: గురండి పాఠశాలలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విద్యార్థుల శ్రమదానం

నరసన్నపేట: మండలంలోని జమ్ములో జ్ఞానజ్యోతి, సత్యవరంలో ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం శ్రమదానం చేపట్టారు. పాఠశాలల ఆవరణలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాల్లో పీఓలు అప్పారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



కొత్తూరు: కొత్తూరులో మానవహారంగా ఏర్పడిన మహిళలు

ఆమదాలవలస రూరల్: ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం ఓటు వజ్రాయుధంలా పనిచేస్తుందని ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలో వెదుళ్లవలస గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. రాజ్యాంగ ప్రకారం ఓటు హక్కు దృఢమైనదని, ఓటును అమ్ముకోకుండా నిజాయితీగా వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కులేని యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కొత్తూరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక ఏపీఎం జనార్దనావు కోరారు. కొత్తూరులో స్వీప్ కార్యక్రమంలో భాగంగా మహిళ సంఘాల సభ్యులతో ఓటు హక్కు వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు ఎంఎంఎస్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్లు కూడలి వరకు ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడి ఓటు విలువపై అవగాహన కల్పించారు. సీసీలు, సీఎఫ్‌లు, వీఓఏలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కొత్తూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని స్థానిక ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ సూచించారు. మండలంలోని మాతల చెక్ పోస్టు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై వాహన చోదుకులకు మంగళవారం ఎస్ఐ అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు, వాహనదారులకు హెచ్చరించారు. చెక్ పోస్టు వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనచోదులకు నుంచి అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

వాహనాల తనిఖీ



బూర్జ: కేకే రాజపురం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



జలుమూరు: తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జలుమూరు: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో జలుమూరు మండల కేంద్రంతోపాటు ముఖ్య కూడళ్లు అయిన చల్లవానిపేట, శ్రీముఖలింగం, కొమనాపల్లి వద్ద రెవెన్యూ, పోలీస్ అధికారులు వాహనాలను మంగళవారం తనిఖీ చేపట్టారు. జలుమూరు వంశధార కాలవ వద్ద సరుబుజ్జిలి, హిరమండలం, శ్రీముఖలింగం నుంచి వస్తున్న వాహనాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. డీటీ తిరుపతిరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. మద్యం, గంజాయి అక్రమ రవాణాతోపాటు అధికంగా డబ్బును తీసుకువెళ్తే తగిన పత్రాలు చూపించాలన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని కేకే రాజపురం గ్రామం ప్రధాన రహదారిపై ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు మంగళవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల ప్రకారం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎంసీసీ అధికారి టి.రఘు ఆధ్వర్యంలో ఆమదాలవల–పాలకొండ రోడ్డుపై వస్తున్న వాహనాలను పరిశీలించారు. ఆర్ఐ ఎస్.వెంకటరావు, ఏఎస్సై వై.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు మద్యం సీసాలు స్వాధీనం

బూర్జ: మండలంలోని కొల్లివలస జంక్షన్‌లో మంగళవారం వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో పొన్నాడ వెంకటరమణ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న ఆరు మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్సై జి.వి.ప్రసాద్ తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు. మద్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

• చిరు జల్లులు..



ఎల్.ఎన్.పేట: కోవిలాం సమీపంలో కురుస్తున్న వర్షం

పలు ప్రాంతాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతోపాటు వర్షం కురిసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని సుమారు గంట సమయం జల్లులు కురిశాయి. పొలాల్లో అక్కడక్కడ నీరు చేరింది. మామిడి తోటల్లో పిందెలు రాలిపోయాయని కాపలాదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటుకల తయారీదారులకు కొంతమేర నష్టం వాటిల్లింది. వాణిజ్య పంటలను సాగు చేస్తున్న రైతులు వర్షం మేలు చేసిందని చెబుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: బొర్రంపేట రోడ్డుకు సమీపంలో ఇటుకలపై కప్పిన టార్పాలిన్లు



నరసన్నపేటలో..



మెళియాపుట్టి: సవర జాడుపల్లి వద్ద కురుస్తున్న వర్షం



పాతపట్నంలో..



సారవకోటలో..